సాక్షి
వనపర్తి
సోమవారం । 19 । ఆగస్టు । 2024



గుట్టుగా గుప్తనిధుల వేట
ఉమ్మడి గండేడ్ మండలం పరిధిలో గుప్తనిధుల వేట గుట్టుగా సాగుతోంది.
వివరాలు 8లో ▸



చిత్రం.. పదిలం
ఆదివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' దృశ్యమాలిక..
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.3 /22.1
ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

23న డీసీసీబీ చైర్మన్ ఎన్నిక

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు ఈ నెల 23న బ్యాంకు ఆవరణలో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటాస్‌పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో చైర్మన్ చిట్యాల నిజాంపాషా గత నెల 30న తన పదవికి రాజీనామా చేయగా.. ఇన్‌చార్జి చైర్మన్‌గా డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 మంది డైరెక్టర్లు ఉండగా.. వారంతా చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. గతంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్న బీఆర్‌ఎస్ పార్టీ మెజారిటీ డైరెక్టర్లు కలిగి ఉండటంతో తిరిగి ఆ పార్టీకి చెందిన వ్యక్తే చైర్మన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మొత్తం 15 మంది డైరెక్టర్లలో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు మినహాయించి, మిగతా వారంతా బీఆర్‌ఎస్ డైరెక్టర్లే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున రాజకీయ ప్రయోజనాల కోసం చైర్మన్ పదవి బీఆర్‌ఎస్ నుంచి చేజారిపోతుందా..? మంత్రి, ఎమ్మెల్యేలు చక్రం తిప్పనున్నారా అనేది వేచి చూడాలి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన మరో డైరెక్టర్ మంజులారెడ్డి సైతం చైర్మన్ పదవికి పోటీ పడనున్నారు. బీఆర్‌ఎస్ తరఫున డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య ప్రయత్నిస్తున్నారు.


షెడ్యూల్ వివరాలు ఇలా..

ఈ నెల 23న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11.30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 12 నుంచి 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 2.30 గంటలకు అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తారు. 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు, ఆ తర్వాత ఫలితాల వెల్లడి ఉంటుందని సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటస్ పాల్ తెలిపారు.

సమయం మించొద్దు

ఉపాధ్యాయులకు జీపీఎస్ హాజరు

- సమయ పాలన పాటించేందుకు కలెక్టర్ ఆదేశాలు
- క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు
- క్లస్టర్, ఎంఈఓల పర్యవేక్షణ డీఈఓలకు అప్పగింత



జిల్లాలో 2,030	42,681
మంది ఉపాధ్యాయులు	మంది విద్యార్థులు

వనపర్తిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇక నుంచి జీపీఎస్ హాజరు నమోదు చేయనున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు యథావిధిగా ఉదయం 9 గంటలకు ప్రారంభం కావడంతో, వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయానికి చేరుకోలేకపోతు న్నారు. దీంతో విద్యార్థులకు పాఠశాలలో నిర్ణీత గడువులో సబ్జెక్ట్ పిరియడ్స్ జరగడంలో వ్యత్యాసం నెలకొంటుంది. ఉపాధ్యాయుల ఆలస్యం కారణంగా పాఠశాలలపై పర్యవేక్షణ ప్రభావం తగ్గి, విద్యార్థుల డ్రాప్ ఔట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేందుకు కలెక్టర్ ఆదర్శ్ సురభి జీపీఎస్ హాజరు నమోదును తెరపైకి తీసుకొచ్చారు. హాజరు నమోదులో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలకు వెళ్లే ప్రతి ఉపాధ్యాయుడు జీపీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నిర్ణీత సమయానికి పాఠశాల వేదికగా సెల్ఫీ ఫొటో తీసి పంపాలని, ఈ ప్రక్రియను ఆగస్టు 17(శనివారం) నుంచే అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆ దిశగా ఎలాంటి అడుగులు పడలేదని విద్యాశాఖ వర్గాలే స్పష్టంగా చెబుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలు తక్షణం అమలు చేయాలని సమావేశంలో సూచించిన విద్యాధికారులు కనీసం ప్రొసీడింగ్/సర్క్యులర్ జారీ చేయకపోవడం ఉపాధ్యా యుల్లోనే విద్యాశాఖ పనితీరుపై చర్చకు దారితీసింది.

పర్యవేక్షణ ఇలా..

జిల్లాలో 358 ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 58 ప్రాథమికోన్నత, 121 ఉన్నత, కేజీబీవీ, ఆదర్శ, ఆశ్రమ, యూఆర్‌ఎస్ పాఠశాలలు కలిపి 121 ఉన్నాయి. వీటికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:15 వరకు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 42,681మంది విద్యార్థులు ఉన్నారు. వాటన్నింటినీ 35 క్లస్టర్లుగా విభజించారు. ఒక్కొక్క క్లస్టర్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 12 నుంచి 20 వరకు పాఠశాలలు ఉంటాయి. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా క్లస్టర్ పరిధిలో ఉండే ఉపాధ్యాయులు జీపీఎస్‌తో ఫొటో తీసి ఆ ఫొటోను క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు పంపించాలి. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఆ ఫొటోలను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించాలని ఆదేశించారు. దీంతో క్లస్టర్ల వారీగా ఉపాధ్యాయుల సమయపాలనపై అవగాహన రావడంతో పాటుగా జిల్లా వ్యాప్తంగా పరిస్థితిపై పూర్తిస్థాయిలో అంచనా వచ్చేందుకు ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కలిపి 2,030 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉపాధ్యాయుల్లో వణుకు

జీపీఎస్ హాజరు అంశం కలెక్టర్ ప్రస్తావించడంతో ఇష్టానుసారంగా పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయుల్లో వణుకు మొదలైంది. అరకొర రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులు, మరీ ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చేపట్టిన ప్రక్రియ ఒక కొలిక్కి రాగానే మార్పులకు, చేర్పులకు అవకాశాలు ఉంటాయని విద్యాశాఖ వర్గాల్లో వినిపిస్తుంది.

ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదు

జీపీఎస్ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు విద్యాశాఖ తరఫున ఎలాంటి ప్రొసీడింగ్ ఇవ్వలేదు. సోమవారం తర్వాత ఆ దిశగా చర్యలు చేపడుతాం. జీపీఎస్ హాజరు అమలు చేసేలా చూస్తాం.
– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ

శుభపరిణామం



జీపీఎస్ హాజరు అమలు చేయాలనుకోవడం శుభపరిణామం. కలెక్టర్ నిర్ణయంతో పేద విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. ఉపాధ్యాయుల్లోనూ సమయానికి వెళ్లే ఈ నిర్ణయం ఆత్రుతను పెంచుతుంది. పేద విద్యార్థులకు మేలు కలిగే ప్రతి నిర్ణయాన్ని స్వాగతించాలి.
– సాబేర్, హిందీ పండిత్, బలిజపల్లి

9 గంటలకు పాఠశాలలో ఉండాలి..

కొంత మంది ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వెళ్లడం లేదని ఫిర్యాదు వస్తున్నాయి. ప్రతి ఉపాధ్యాయుడు 9 గంటలకు పాఠశాలకు చేరుకొని జీపీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సెల్ఫీ ఫొటో తీసి పంపాలి. ఈ ప్రక్రియ శనివారం నుంచి(ఆగస్టు 17) కచ్చితంగా అమలు కావాలి. తీసుకున్న సెల్ఫీ ఫొటోను సంబంధిత క్లస్టర్ హెడ్‌మాస్టర్‌కు పంపాలి. క్లస్టర్ హెడ్‌మాస్టర్, ఎంఈఓలు డీఈఓకు పంపాలి. ఆలస్యంగా విధులకు వెళ్లే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ఆగస్టు 16న, విద్యాశాఖ అధికారి విద్యాధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలియజేశారు.

అనుబంధాల ప్రతీక.. రాఖీ



అక్కాతమ్ముళ్లు.. అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకొనే పండుగే రాఖీ. సోదరి తన సోదరుడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటే.. సోదరి కట్టిన రక్షాబంధాన్ని స్వీకరించిన సోదరుడు తానెప్పుడూ సోదరికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో నానాటికి బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న తరుణంలో రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర, సోదరీమణుల మధ్య ఉండే అనుబంధాలు.. ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగుదలకు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధానికి, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా నిలుస్తుంది రాఖీ పండుగ. ఆధునిక కాలంలోనూ ఎక్కడ ఉన్నా తమ అన్నతమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు.. అక్కాచెల్లెళ్లు తరలివస్తుంటారు. అలాగే విదేశాల్లో ఉన్నవారు సైతం కొరియర్‌లోనూ తమవారికి రాఖీలు పంపిస్తూ.. అనుబంధాలను చాటిచెబుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్‌లోనూ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.
– స్టేషన్ మహబూబ్‌నగర్/అచ్చంపేట/ ఆత్మకూర్

- ప్రేమానుబంధాలను చాటుతున్న పండుగ
- ఆధునిక కాలంలోనూ తగ్గని ఆదరణ
- కొరియర్ల ద్వారా తమ వారికి రాఖీలు పంపుతున్న వైనం
- సోషల్ మీడియాలోనూ శుభాకాంక్షల వెల్లువ
- నేడు రక్షాబంధన్ వేడుకలు

మార్కెట్లు కిటకిట..



వనపర్తి పట్టణంలో రాఖీల కొనుగోలు

మార్కెట్లో వివిధ రకాల ఆకృతుల్లో రాఖీలు లభిస్తున్నాయి. చిన్నారులకు సంబంధించిన బొమ్మల రాఖీలు, ప్రకృతి రమణీయతను చాటేలా, దేవతా మూర్తుల ఫొటో ప్రింట్ రాఖీలు కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. లైట్ వెయిట్‌తో ఉన్న రాఖీలు, ఫ్యాన్సీస్టోన్ రాఖీలు, మెటల్ ప్రింటెడ్ రాఖీల నుంచి కొంతమేర పెద్దసైజు గల రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ రకాల డిజైన్లను బట్టి రూ.10 నుంచి రూ.300ల వరకు ధరలు పలుకుతున్నాయి. సోమవారం రాఖీ పండుగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న మహిళలు తమకు కావాల్సిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మార్కెట్లు, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

74 ఏళ్ల అనుబంధం



అన్న వెంకటన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు కళావతమ్మ

ఆత్మకూర్‌కు చెందిన కడియాల వెంకటన్న 91 ఏళ్లు. ఈయనకు ఒక అక్క పెద్ద వెంకటమ్మ(93) ఇటీవల కాలం చేసింది. ఇద్దరు చెల్లెళ్లు ఉండగా రెండో చెల్లెలు చిన్న వెంకటమ్మ పదేళ్ల క్రితమే చనిపోయింది. ఇక చిన్న చెల్లెలు కళావతమ్మ వయస్సు 82 సంవత్సరాలు. ఈమె గత 74 ఏళ్లుగా తన అన్న వెంకటన్నకు రాఖీ కడుతూనే ఉంది. అన్నకు ఆప్యాయంగా మిఠాయి తినిపిస్తే అన్న అందుకు చెల్లికి కానుకలను ఇస్తూనే ఉన్నాడు. 74 ఏళ్లుగా వీరి ఆత్మీయానుబంధం కొనసాగుతుండటం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కండక్టర్ చెల్లెమ్మ



డిపోలో ఉద్యోగులకు రాఖీలు కడుతున్న చిట్టెమ్మ (ఫైల్)

జిల్లాకేంద్రానికి చెందిన చిట్టెమ్మ 1997లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా నియామకమైంది. తనకు ఎంతో ఇష్టమైన రాఖీ పండుగను తోటి కండక్టర్లు, డ్రైవర్లతో జరుపుకోవాలనే ఉద్దేశంతో అదే ఏడాది నుంచి రాఖీలు కట్టడం ప్రారంభించింది. డిపోలోని దాదాపు 200 మందికిపైగా డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి కులమతాలకతీతంగా రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుతోంది. రాఖీపండుగ వచ్చిందంటే డిపోలోని అందరూ చిట్టెమ్మ కట్టే రాఖీ కోసం ఎదురుచూస్తుంటారు. అయితే ఈసారి రాఖీ పండుగ రోజు కుటుంబంతో కలిసి శబరిమలై వెళ్తున్నానని, మంగళవారం వచ్చి అందరికీ రాఖీలు కడతానని చిట్టెమ్మ 'సాక్షి'కి తెలిపింది.

డల్లాస్ నుంచి కొరియర్‌లో..



గతేడాది తమ్ముడు వినయ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న

మహబూబ్‌నగర్‌కు చెందిన ఆర్.రాంకోటి, ప్రభావతికు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు. వీరిలో పెద్దమ్మాయి సౌమ్య పెళ్లి అనంతరం గత నాలుగేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. మూడేళ్లు చికాగోలో ఉండగా ఏడాది నుంచి డల్లాస్‌లో ఉంటున్నారు. చెల్లి, తమ్ముడితో కలిసి ప్రతి రాఖీ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకొనేవారు. గతేడాది ఇక్కడికే వచ్చిన ఆమె తమ్ముడికి స్వయంగా రాఖీ కట్టింది. ఈ ఏడాది అమెరికాలో ఉండడంతో తన తమ్ముడు వినయ్‌కుమార్‌కు డల్లాస్ నుంచి కొరియర్ ద్వారా తమ్ముడికి రాఖీ పంపించింది. దీంతో వినయ్‌కుమార్ అక్క సౌమ్య పంపిన రాఖీతోపాటు మరో సోదరి విష్ణుప్రియతో రాఖీ కట్టించుకుంటానని పేర్కొన్నాడు.

తమ్ముడిని మిస్ అవుతున్నా..

చిన్నప్పటి నుంచి రాఖీ పండుగ అంటే ఎంతో ఇష్టం. ప్రస్తుతం డల్లాస్‌లో ఉండడం వల్ల తమ్ముడిని రాఖీ కట్టలేకపోతున్న. గతేడాది రాఖీ పండుగ రోజు అక్కడే ఉండడం వల్ల తమ్ముడికి రాఖీ కట్టాను. ఈ ఏడాది రాఖీ పండుగ రోజు తమ్ముడిని ఎంతో మిస్ అవుతున్నా. నేను పంపే రాఖీ తమ్ముడికి అందాలనే ఉద్దేశంతో మూడేళ్ల నుంచి కొరియర్ ద్వారా పంపుతున్న. ఆ రోజు వీడియో కాల్‌లో తమ్ముడికి రాఖీ పండుగ శుభాకాంక్షలు చెబుతాను.
– సౌమ్య, ఎన్‌ఆర్‌ఐ (డల్లాస్)

నూలు పుట్టిన రోజు



అచ్చంపేట భక్త మార్కండేయ ఆలయంలో గాయత్రిమాల ధరిస్తున్న పద్మశాలీలు

రాఖీ పండుగంటే సాధారణంగా అక్కా చెల్లెళ్లు, తమ సోదరులకు రాఖీలు కట్టి వేడుకగా చేసుకుంటారు. అయితే అచ్చంపేటలో పద్మశాలీలు మాత్రం వినూత్నంగా జరుపుకొంటారు. రాఖీ పండుగను నూలు పుట్టిన పండుగగా నిర్వహిస్తారు. ఇది 400 ఏళ్ల నుంచి వస్తున్న పండుగ. పురాణాల్లో నూలు గురించి ఉంది. ఈ రోజు నూలు పుట్టిందని, నూలుతో తయారు చేసిన కంకణం కట్టుకొని చేపట్టే ప్రతి కార్యంలో సకల శుభాలు కలుగుతాయని పద్మశాలీల నమ్మకం.

శుభానికి సూచిక..



ఎంతో నిష్టగా ఉండి నూలుతో తయారు చేసిన కంకణం, జంధ్యం ధరిస్తారు. ఇవి సంప్రదాయంతోపాటు శుభానికి సూచికగా భావిస్తాం. ఈ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తాం. పద్మశాలీలు అనాదిగా దీన్ని నిర్వహిస్తున్నాం. రాఖీ పౌర్ణమిని నూలు పుట్టిన దినంగా జరుపుకోవడం ఆనవాయితీ. అచ్చంపేటలో 42 ఏళ్లుగా సామూహికంగా జరుపుతున్నాం.
– రమేష్, పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

గాయత్రీ మాలధారణ..

పత్తితో తయారు చేసిన దారంతో కంకణం ధరించడమే కాకుండా.. జంధ్యం (గాయత్రి మాల)కూడా ధరిస్తారు. గాయత్రి హోమం నిర్వహించిన తర్వాత జంధ్యాలను ధరిస్తారు.

'రచ్చబండ'ను విజయవంతం చేయాలి



ఖిల్లాఘనపురంలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

ఖిల్లాఘనపురం: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. ఆదివారం రచ్చబండ కార్యక్రమం సన్నాహక సమావేశాన్ని ముఖ్య నాయకులతో ఖిల్లాఘనపురంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ ప్రతిరైతుకు చేయడం జరిగిందని చెబుతుందన్నారు. కాని చాలామంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రుణమాఫీ కాని రైతులతో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకు రావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బుచ్చిబాబుగౌడ్, కుమారస్వామి, రవినాయక్, విక్రం, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప వీరుడు పాపన్నగౌడ్



పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: మొఘల్ సామ్రాజ్యాన్ని కుప్పకూల్చిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మార్కెట్ కమిటీ చైర్మన్, గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పాపన్న గౌడ్ 374వ జయంతి నిర్వహించారు. ఈ మేరకు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. మొఘల్ పాలనకు పాపన్న గౌడ్ వ్యతిరేకంగా పోరాడి 31 కోటలను జయించాడని, అన్ని కులాలను ఏకం చేసి దళిత బహుజనుల హక్కులకు పోరాడాడని గుర్తు చేశారు. దళిత బహుజనులను ఏకం చేసి, బహుజన రాజ్యాధికారం తీసుకొచ్చి, కొన్ని వందల ఏళ్ల కిందట గోల్కొండపై బహుజన జెండా ఎగురవేశాడని కొనియాడారు. ప్రజల్లో పోరాట స్ఫూర్తి జ్వాలలు రగిలించిన సర్దార్ సర్వాయి పాపన్న ఆదర్శాలు నేటితరానికి విస్తరింపజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, శంకర్‌గౌడ్, సురేష్, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఫాగింగ్

దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

- పట్టణాల్లో పడకేసిన పారిశుద్ధ్య పనులు
- మరమ్మతుకు నోచుకోని ఫాగింగ్ యంత్రాలు
- వర్షపు నీటి నిల్వతో పెరుగుతున్న దోమలు, ఈగలు



పట్టణంలోని శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న పాడుబావిలో మురుగు

అమరచింత: వర్షాకాలంలో వర్షపు నీటితో రహదారులు, కాలనీ రహదారులు బురదమయమవుతున్నాయి. వీటికి తోడు రహదారులపై నిల్వ ఉన్న నీటిలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. చీకటి పడకముందే దోమలు ఇళ్లలోకి చొరబడి మనుషుల రక్తన్ని తాగే పనిలో పడుతూ.. ప్రజలకు విషజ్వరాలు తీసుకొస్తున్నాయి. దీంతో ప్రజలు విషజ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్న పరిస్థితులు దాపురించాయి. దోమలు, ఈగల నుంచి పట్టణ ప్రజలను కాపాడేందుకు ప్రతి మున్సిపాలిటీలో ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి వాటి ద్వారా పట్టణంలో దోమలను అరికట్టే యత్నాలకు శ్రీకారం చుట్టేవారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లోని ఫాగింగ్ యంత్రాలు సగానికిపైగా మరమ్మతు లేక మరుగున పడ్డాయి.

● జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, పెబ్బేర్, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో మొత్తం 14 ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 7 ఫాగింగ్ యంత్రాలు పనిచేయడం లేదు. దోమల నివారణకు గతంలో నీటి నిల్వల ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదిలేవారు. అవి లార్వాను తినేసి దోమల ఉత్పత్తి తగ్గించేవి. అంతే కాకుండా బ్లీచింగ్ పౌడర్, సున్నం వంటి వాటిని చల్లి ప్రజలను దోమల బెడద నుంచి కాపాడే యత్నం చేస్తుండేవారు. కాని ఇలాంటి పనులు ఎక్కడా కనిపించడం లేదు. కేవలం నామమాత్రంగా అప్పుడప్పుడు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడంతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పారిశుద్ధ్యానికి అరకొర నిధులు

పట్టణాల్లో పారిశుద్ధ్య పనుల కోసం మున్సిపల్ బడ్జెట్ సమావేశాల్లో నిధులను అరకొరగా కేటాయించడం, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడం, కేటాయించిన నిధులను ఇతర పనుల కోసం వినియోగించుకోవడంతో పారిశుద్ధ్య పనులు అరకొరగా సాగుతున్నాయి. జనాభా ప్రాతిపదికన, వార్డుల వారీగా ఎన్ని ఫాగింగ్ యంత్రాలు అవసరం అవుతాయనే విషయాలను సైతం ఇప్పటి వరకు గుర్తించకపోవడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారం రోజుల కిందట నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం కేవలం నామమాత్రంగా నిర్వహించారని, పట్టణ ప్రాంతాల్లో వీటి లక్ష్యం నెరవేరలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



జామియా మసీదు వెనుకాల ఇలా..

మున్సిపాలిటీల వారీగా ఫాగింగ్ యంత్రాలు..



అమరచింత మున్సిపల్‌లో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ యంత్రం

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వనపర్తిలో ఆరు ఫాగింగ్ యంత్రాలు ఉండగా.. వీటిలో మూడు యంత్రాలు పనిచేయడం లేదు. అమరచింతలో 1, ఆత్మకూర్‌లో 1, కొత్తకోటలో 1, పెబ్బేర్‌లో 5 ఫాగింగ్ యంత్రాలు ఉండగా.. వీటిలో 2 పనిచేయడంలేదు. కొత్త మున్సిపాలిటీల్లో మూడు ఫాగింగ్ యంత్రాలు ఉంటే వాటి ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమల బెడద ఎక్కువైంది..



వీధిలో మురుగు కాల్వలను నాలుగు నెలలకోసారి పూడిక తీస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తుంది. వీటికి తోడు దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. సాయంత్రం అయ్యిందంటే ఇంటి బయటి తలుపులు మూసుకొని ఉండే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.
– మునీరా బేగం, అమరచింత

మురుగు తొలగించలేకపోతున్నారు..



పట్టణంలోని ఒకటో వార్డు నాగులబావిలో మురుగుతో నిండింది. దీంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో దోమలు బెడద ఎక్కువైంది. రాంనగర్ నుంచి వస్తున్న మురుగు కాల్వల నీటిని నేరుగా బావిలోకి వెళ్లేలా కాల్వ నిర్మాణం చేపట్టారు. దోమల నివారణ ఫాగింగ్ చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– బాలకృష్ణ, అమరచింత

చర్యలు చేపడుతున్నాం..



పట్టణంలో పారిశుద్ధ్య పనులతో పాటు డ్రెయినేజీల పరిశుభ్రత కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నాం. వానాకాలంలో దోమల వ్యాప్తి జరుగకుండా ఫాగింగ్ చేపడుతున్నాం. వార్డుల వారీగా ఫాగింగ్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు తగు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.
– నురుల్ నదీం, మున్సిపల్ కమిషనర్, అమచింత

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

బిజినేపల్లి : మండలంలోని వట్టెంనకు చెందిన మావిళ్ల మల్లేష్ (30) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. మల్లేష్ వరినాటు వేయడానికి కుటుంబ సభ్యులను పొలానికి పంపించి ఇంటి వద్దనే ఉన్నాడు. కాగా తన తల్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే అతడు ఇంట్లో ఉరేసుకుని చనిపోయి కన్పించాడు. వ్యక్తిగత సమస్యల వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. మల్లేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

పాన్‌గల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. కిష్టాపూర్‌నకు చెందిన శివ(23)కు ఇదే గ్రామానికి చెందిన లావణ్యతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా రెండేళ్ల క్రితం లావణ్య హైదరాబాదులో ఉంటున్న వారి తల్లి దండ్రుల వద్దకు వెళ్లింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో గతంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే శివ మనస్తాపం చెందాడు. కుటుంబ సభ్యులతో కూడా చర్చించేవాడు. శనివారం అర్ధరాత్రి ఇంట్లో స్లాబ్‌కు ఉన్న ఉయ్యాల కొండ్లకు ఉరివేసుకొని మృతిచెందాడు. శివ తల్లి పెద్ద వెంకటమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు. తిరుమలగిరి పిచ్చాయికుంటతండాలో నివాసం ఉంటున్న పాత్లావత్ పన్నీ(65) 13న గంగాపూర్ నుంచి తండాలోని ఇంటికి కాలినడకన వెళ్తుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె పాత్లావత్ మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుతో గొర్రెలకాపరి మృతి

దేవరకొండ: పిడుగుపాటుతో గొర్రెలకాపరి మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ నర్సింహులు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన సతీష్(45) గొర్ల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పట్టణ శివారులోని ముదిగొండ రోడ్డులో జీవాలను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, పిడుగుల శబ్దం రావడంతో పక్కనే ఉన్న చెట్టు వద్దకు వెళ్లాడు. చెట్టుమీద పిడుగు పడడంతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కొందరు ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

గుట్టుగా గుప్తనిధుల వేట


సల్కర్‌పేట్ శివారులోని తూముగుట్ట వద్ద చేసిన తవ్వకాలు

- మూఢనమ్మకాలతో నిండు ప్రాణాలు బలి
- ఆనవాళ్లు కోల్పోతున్న చారిత్రాత్మక కట్టడాలు
- బొంరాస్‌పేట్ ఘటనతో ఉలిక్కిపడిన స్థానికులు

గండేడ్: రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలన్న అత్యాశ నిధి దొరుకుతుందన్న మూఢత్వం గుప్తనిధుల అన్వేషణకు కారణమవుతుంది. చెట్టు, పుట్ట, గుట్టలతో పాటు చారిత్రాత్మక కట్టడాలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో నిండు ప్రాణాలు సైతం బలవుతున్నాయి. ఉమ్మడి గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, గోవిందుపల్లి, వరహగిరిపల్లి, పీర్లబండతండా, ధర్మాపూర్, మహమ్మదాబాద్, మొకర్లాబాద్, చిన్న వార్వాల్ శివారులో గుప్తనిధుల కోసం తవ్వుతున్నారు. ముఖ్యంగా గండేడ్ మండలంలో ఎక్కువగా గుట్టలు ఉండడంతో తవ్వకాలు చేస్తున్నారు. వందల ఏళ్ల క్రితం ఈప్రాంతం రాజులు విడిది ప్రదేశంగా ఉన్నట్లు పెద్దలు చెబుతారు. గట్టుపైకి వెళ్లడానికి చెన్నరాయుడి గుట్టకింద గల ఆంజనేయస్వామి దేవాలయం ముందు నుంచి దారి ఉండేది. రాతి కడ్డీలతో ఒక పెద్ద ఆర్చి కూడా ఉండేది. ఈ ప్రహరి గుండానే గుట్టపైకి రాజులు చేరుకునే ఇటీవల అది కూలిపోయింది. నాలుగైదు గుట్టలు కలిపి గుట్టల చుట్టూ ప్రహరి నిర్మించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. దీంతో ఈ గుట్టపై ఇప్పటికీ ఏదో ఒక చోట తవ్వకాలు కొనసాగుతూనే ఉంటాయి.

రంగసాని ఆలయంలో..

వరహగిరిపల్లి సమీపంలో చెన్నరాయుడు కొలువుదీరిన గుట్ట ఉంది. దానిపై రాజుల విడిది ప్రాంతంగా భావించే ప్రాంతంలో రాతికడ్డీలతో రంగసాని ఆలయం నిర్మించారు. ఇందులో శివలింగం ప్రతిష్ఠించినట్లు పెద్దవాళ్లు చెబుతుంటారు. దీన్ని కూడా వదల్లేదు. ప్రస్తుతం అక్కడ శివలింగం లేకపోగా ఆలయం మధ్య తవ్వకాలు జరిపారు. దీని చుట్టూ చాలా చోట్ల తవ్వకాలు చేశారు. దీంతో పాటు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో, మాల గుట్టలపై కూడా విచ్చలవిడి తవ్వకాలు జరిగాయి.



తవ్వకాల్లో దెబ్బతిన్న రంగసాని ఆలయం వెనుకభాగం, ఆలయ సమీపంలో తవ్విన గుంత

ఏడాదిగా ప్రయత్నాలు..

ఇక్కడ నదిలో నిధి ఉందని ఆధారాల ద్వారా తేలడంతో దానిని ఎలాగైన సొంతం చేసుకోవాలని అక్రమార్కులు పథకం రూపొందించారు. చుట్టు పక్కల స్థానిక గ్రామాలకు చెందిన వారితో హైదరాబాద్, భువనగిరి తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ఇందులో భాగస్వాములయ్యారు. పలుమార్లు ఆ ప్రాంతానికి చేరుకుని కలియతిరిగారు. ముందుగా తూము కింద ఉన్న రాతి కట్టడాల వద్ద ఇటాచీతో తవ్వి చూశారు. కానీ వారికి ఎలాంటి నిధి లభించలేదు. తర్వాత గుప్తనిధుల తవ్వకంపై అనుభవం ఉన్న వారి సూచనల మేరకు తూములో 18 మీటర్ల నిలువు తవ్వాలని చెప్పడంతో కొన్ని రోజుల పాటు తవ్వారు. కాని అక్కడా ఏమీ లభించలేదు. దీనిపై మరొకరిని సంప్రదించగా లోతుగా కాకుండా లోపల అడ్డంగా తవ్వితే నిధి దొరుకుతుందని చెప్పడంతో మే 17న తవ్వకాలు జరిపేందుకు తొమ్మిది మంది కలిసి వెళ్లారు. మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో తూములోపల తవ్వుతుండగా బండరాయి కూలిపడి దోమ మండలం దాదాపూర్‌కు చెందిన సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం బయటపడితే తాము దొరికిపోతామని భావించి మృతదేహం, బైక్‌ను తీసుకెళ్లి బొంరాస్‌పేట్ శివారు పరిధిలో బ్రిడ్జి మీద నుంచి పడేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరించాలని చూశారు. కుటుంబీకుల అనుమానం మేరకు పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఇందుకు కారణమైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. గతంలో ధర్మాపూర్ అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తే స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చిన్నవార్వాల్ సమీపంలో అల్మాస్ఖాన్‌పేట్ వద్ద విచ్చలవిడిగా తవ్వకాలు చేశారు. మసీదును కూడా కూల్చారు. ఇలా గుప్తనిధుల తవ్వకాలు జరిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవడమేకాక జైలు పాలవుతున్నారు. అంతేకాక చారిత్రాత్మకత ఆనవాళ్ల లేకుండా చేస్తున్నారు. ఇలాంటి వాటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నదిలో నిధి పేరుతో తవ్వకం

సల్కర్‌పేట్ శివారులో పెద్దవాగు పక్కన తూముగుట్ట ఉంది. వందల ఏళ్ల క్రితం మాలగుట్ట తూము గుట్టలను కలుపుతూ చెరువును నిర్మించారు. ఈ చెరువు ద్వారా నీటిని పగిడ్యాల్ పరిసర ప్రాంతాలను పారబెట్టేవారు. గుట్టలో నుంచి సొరంగమార్గం ద్వారా కాల్వ ఉన్నట్లు సమాచారం. దీని నుంచి ఈ చెరువు నీటిని వ్యవసాయానికి వినియోగించినట్లు స్థానికుల చెబుతుంటారు. అయితే కొన్నేళ్ల క్రితం వరదలకు ఈ చెరువు తెగిపోయింది. ప్రస్తుతం పెద్దవాగు మాత్రమే పారుతుంది. అయితే ఈ తూములో నిధి ఉన్నట్లు పలువురి విశ్వాసం. తూము వద్ద ఏనుగుబొమ్మ ఉండడంతో పాటు తూముకు కుడి వైపు కొద్ది దూరంలో శాసనం ఉన్నట్లు చెబుతారు. దీంతో పాటు ఆంజనేయస్వామి చేతిలో రామచిలుక వంటివి ఉండడంతో నిధి ఉందని విశ్వసించారు. దీనిపై కన్నేసిన పలువురు ఇక్కడ ఉన్న ఆధారాలను శాసనాలను ఫొటోలు తీసుకొని కేరళ, తమిళనాడులోని పలువురు శిలాశాసనాలు చదివే వారిని సంప్రదించారు. ఈ ఆధారాల ప్రకారం నదిలో నిధి ఉందనేది దాని సారాంశం. దీంతో ఇక్కడ గుట్టుగా తవ్వకాలు చేపట్టారు.

తరుచూ కొత్త వ్యక్తులు వస్తున్నారు..



నాలుగైదు నెలలుగా తూము గుట్ట ప్రాంతంలో కొత్త వ్యక్తులు వచ్చి వెళ్లేవారు. మే నెల మొదటి వారంలో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గోవిందుపల్లి బీటీ రోడ్డు కొలత చేస్తున్నాం. పీర్లబండతండా బ్రిడ్జి దాటిన తర్వాత కారు వచ్చి ఆగింది. అందులో 8 మంది వరకు వచ్చారు. కారు దిగి దుస్తులు మార్చుకుని చేతిలో అన్నం పొట్లాలు, ప్లేట్లతో పాటు మూడు నాలుగు బ్యాగులతో ఉన్నారు. నేను వెళ్లి తాగడానికి నీళ్లు అడగగా లేవని చెప్పారు. వారితో పాటు ఓ మహిళ కూడా ఉంది. ఆమె ఎవరని అడిగితే జడ్జి అని చెప్పడంతో తాను వెనక్కి తిరిగి వచ్చాను. వారు తూము గుట్ట వైపు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం కోస్గికి వెళ్తుండగా పాతర్‌గడ్డ సమీపంలో మూడు కార్లలో అక్కడికి వచ్చిన వారితోపాటు మిగతా వారు ఉన్నారు. తరుచుగా కొత్త వ్యక్తులు వచ్చి వెళ్తుంటారు. – గత్పు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్, జానంపల్లి

ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దు..



గుప్తనిధులు ఉంటాయనేది మూఢ నమ్మకం. ఇవి వందతులు మాత్రమే వీటిని నమ్మి తవ్వకాలు చేపట్టడం సరికాదు. ఎక్కడ పడితే అక్కడ తవ్వి చారిత్రాత్మక కట్టడాలను కూల్చవద్దు. వాటిని ధ్వంసం చేయడం నేరమే. దీని వల్ల ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఒకవేళ శాసనాలు, కట్టడాలు, కొత్త ప్రదేశాలు ఏమైన ఉంటే అర్కియాలజి వారికి సమాచారం ఇస్తే వారు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారు. అడవులు, గుట్టల ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమీప గ్రామాల ప్రజలు సమాచారం అందించాలి. – శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ, మహమ్మదాబాద్

జూరాల ఐదు గేట్లు ఎత్తివేత


వరద నీటితో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన వరద ఆదివారం జూరాలతో పాటు ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జూరాలకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి 50వేల క్యూసెక్కులకు పెరిగింది. కాగా ఐదు గేట్లను ఎత్తి 20,865, ఆవిరిరూపంలో 94, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 730, ఎడమ కాల్వకు 920, కోయిల్‌సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 28వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు వద్ద 6 గేట్లను ఎత్తి 22,240 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.313 టీఎంసీల పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది.

130.123 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి పరుగులు పెడుతుంది. ఆదివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 130.123 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు. జూరాలకు పూర్తిస్థాయి వరద నీరు చేరుతుండడంతో 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతున్నామని ప్రస్తుతం 40వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నామని తెలిపారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడుమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు వివిధ లిఫ్టుల ద్వారా 858, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

సుంకేసులకు 63వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఆదివారం 63,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. డ్యాంలో 1.110 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకుని మిగతా దిగువకు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు. 14 గేట్లను తెరిచి 61,306 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలారు.


సుంకేసుల నుంచి 14 గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

శ్రీశైలంలో 881 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 881 అడుగుల నీటిమట్టం, 193.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 61,306, జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 40,157 మొత్తం 1,01,463 క్యూసెక్కుల నీటిప్రవాహం శ్రీశైలం జలాశయంలోకి వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,681, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,849 మొత్తం 68,530 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 28వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.729 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.688 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

ప్రయాణంలో ఊడిపోయిన బస్సు విడిభాగాలు



ఊట్కూరు సమీపంలో బస్సు నుంచి ఊడి పడ్డ ఓ భాగం.. రోడ్డు పక్కకు ఆపిన బస్సు

ఊట్కూరు: మండల చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం ఓ ఆర్టీసీ బస్సు భాగాలు ఊడి పడ్డాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. నారాయణపేట డిపోకు చెందిన టీఎస్31జడ్0054 నంబర్‌గల సదరు బస్సు సాయంత్రం ఊట్కూరు నుంచి మక్తల్ వైపు వెళ్తుండగా ఘటన జరిగింది. పెద్దశబ్దం చేస్తూ భాగాలు ఊడి పడ్డాయి. ఈ క్రమంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును ఒక వైపు నిలిపివేశాడు. దీంతో ప్రమాదం తప్పింది.

విహారయాత్రలో విషాదం

- వేర్వేరు సంఘటనలో దైవదర్శనానికి వెళ్తూ.. ఇద్దరు మృతి, పలువురికి గాయాలు
- మరో రోడ్డు ప్రమాదంలో ఒకరు, కారు అద్దాలు శుభ్రం చేస్తుండగా మరొకరు


అమృతగౌడ్ (ఫైల్)

మక్తల్: విహారయాత్ర వారి కుటుంబాల్లో విషాదం నింపింది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన మక్తల్ మార్కెట్ మాజీచైర్మన్ ఇద్దరు కుమారులతో కలిసి అమృతగౌడ్, అమరేందర్‌గౌడ్‌తో పాటు ఇద్దరు స్నేహితులు చిన్నపొర్లకు చెందిన ఎలిగండ్ల రమేష్, అడవిసత్యవార్‌కు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి నలుగురు ఈ నెల 16న మక్తల్ నుంచి టీఎస్ 07 కేహెచ్ 7552 వాహనంలో విహారయాత్రకు బయలు దేరారు. అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో దేవాలయాలు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటూ వెళ్లారు. తమిళనాడులో గోల్డెన్ టెంపుల్ చూసుకొని వెళ్తున్న సమయంలో తమిళనాడు కోయంబత్తూర్ నాగపట్టణం హైవే రోడ్డు దిండిగల్ సమీపంలో అతివేగంగా వెళ్తున్నారు. ఈ సమయంలో వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు సీటులో బెల్టు లేకుండా కూర్చున్న అమృతగౌడ్(23) అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న వెంకటేశ్వర్‌రెడ్డికి, అమరేందర్‌గౌడ్, ఎల్లిగండ్ల రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై మక్తల్‌లో తన తండ్రి మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్‌కు సమాచారం అందించారు.


తమిళనాడులో డివైడర్‌ను ఢీకొట్టిన వాహనం

వాహనం అదుపు తప్పి.. మహిళ మృతి

అచ్చంపేట: మహారాష్ట్ర బీదర్ జిల్లా, ఉప్లీకి చెందిన వాగ్మారి విక్కితమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్తున్నారు. అచ్చంపేట మండలం చందాపూర్ జాతీయ రహదారి 765 వద్ద ఎంహెచ్ 14ఈయూ 4998 నంబరు బొలెరొ వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని చంద్రాసాగర్ కాల్వలో పడిపోయింది. ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలు కాగా.. రుక్మిణి(38)కి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. మృతి చెందినట్లు ఎస్‌ఐ రాములు తెలియజేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. డ్రైవర్ అచ్యుత్ విటల్ వాహనం అతివేగంగా నడపడం, నిద్రమత్తు ప్రమాదానికి కారణమని స్థానికులు తెలియజేశారు.

కారు అద్దాలు శుభ్రం చేస్తుండగా..

ఎర్రవల్లి చౌరస్తా: స్నేహితుడి వివాహానికి వెళ్తూ.. ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కుందన్‌వానిపల్లికి చెందిన నవీన్‌చారి అలియాస్ జనార్దన్(26) తన మిత్రులైన పవన్‌కుమార్, శివకుమార్, వెంకటేష్, వికాస్‌సాయితో కలిసి కారులో వారి మిత్రుడి వివాహానికి శనివారం అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా మహానందికి బయలుదేరారు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై ఇటిక్యాల స్టేజీ సమీపంలోకి రాగానే కారును రోడ్డు పక్కన నిలిపారు. కారు అద్దాలను శుభ్రం చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతివేగంతో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అద్దాలను శుభ్రం చేస్తున్న శివకుమార్, నవీన్ ఆచారి (జనార్దన్)లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి నవీన్ ఆచారి(జనార్దన్) మృతిచెందాడు. మృతుని మిత్రుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కాలినడకన వెళ్తుండగా మరొకరు..


చినబాలన్న (ఫైల్)

ఆత్మకూర్/ మక్తల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మక్తల్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆత్మకూర్ మండలంలోని మూలమల్లకు చెందిన దొబ్బలి చిన బాలన్న(60) శనివారం మక్తల్ మండలంలోని చందాపూర్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు మక్తల్ నుంచి కాలినడకన చందాపూర్‌కు వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన ప్రయాణికులు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో మక్తల్‌కు చేరుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆదివారం రాత్రి మూలమల్లకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు బాలన్నకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై మక్తల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- నాలుగుకు చేరిన పెద్దగోల్కొండ ఫ్లై ఓవర్ ప్రమాద మృతుల సంఖ్య

సాయిదీక్షిత మృతి


సాయిదీక్షిత (ఫైల్)

ఆత్మకూర్: ఆ కుటుంబాల్లో దైవదర్శన యాత్ర తీవ్ర విషాదం నింపింది. హైదరాబాద్‌లోని పెద్ద గోల్కొండ వద్ద ఫ్లై ఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇది వరకే ముగ్గురు మృతిచెందగా.. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన సాయిదీక్షిత(13) ఆదివారం మృత్యుఒడికి చేరింది. ఆత్మకూర్‌కు చెందిన రాజేష్ చెందిన 26 మంది కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా హైదరాబాద్‌లోని పెద్దగోల్కొండ ఫ్లై ఓవర్ వద్ద తుఫానును మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు ఓ మహిళ, రెండు నెలల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా.. సాయిదీక్షిత మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో కోమాలోకి వెళ్లిన సాయిదీక్షిత చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సాక్షిదీక్షిత తండ్రి మల్లేష్ ఆర్నెల్ల క్రితమే గుండెపోటుతో మృతిచెందగా.. తల్లి నవనీత, మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం రాత్రి ఆత్మకూర్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సాయిదీక్షిత స్థానిక బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఈమె మృతితో కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థుల రోదనలు మిన్నంటాయి. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన చంద్రశేఖర్, మణెమ్మ, అర్చన, కీర్తనలు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ



శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కోయిల్‌దిన్నె రోడ్డులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు అక్కడ వెలసిన అమ్మవారి గొంతులోని పుస్తెలు దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు, భక్తులు తెలిపారు. ఇటీవల వడ్డేపల్లి మండలంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో పట్టణ వాసులు, వ్యాపారస్తులు, మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శాంతినగర్ పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీ పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా దొంగతనం గురించి ఎవరు ఫిర్యాదుచేయలేదని తెలిపారు.

నాలుగు రోజులుగా మార్చురీ బయటే మృతదేహం

- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రోగులు, ప్రజలు
- హత్యనా, ఆత్మహత్యనా తేలని వైనం
- పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన

శాంతినగర్ : ఓ మహిళ మృతి చెంది నాలుగు రోజులైంది. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించగా, ఖననానికి బంధువులు తీసుకెళ్లకపోవడంతో మార్చురీ ఎదుట మృతదేహం ఉండడం అలంపూర్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు చెందిన వడ్ల సత్యమ్మ (35) ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 15న సెలవు ఉండటంతో సత్యమ్మ పిల్లలు హాస్టల్ నుంచి వచ్చే చూసేవరకు మృతి చెందిన విషయం ఎవరికి తెలియని పరిస్థితి. అదే రోజు తండ్రి కృష్ణమూర్తి పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా, గ్రామంలోని కొందరిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా 16న మృతదేహానికి డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు మాత్రం తమకు తెలియకుండా మృతురాలి పెద్దకూతురితో మరో ఖాళీ పేపర్‌లో సంతకం పెట్టించుకున్నారని మృతురాలి తండ్రి ఆరోపిస్తున్నాడు. అనుమానాస్పద మృతిగా కాకుండా మనస్తాపంతో ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులు కేసు చేస్తామని చెప్పగా అందుకు మృతురాలి కుటుంబసభ్యులు అంగీకరించలేదు. అనుమానిత వ్యక్తులను విచారించిన అనంతరం కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. అనుమానితులపై కేసు నమోదు చేసే వరకు మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తీసుకెళ్లమని మొండికేశారు. పోలీసులు మాత్రం ఎలాంటి విచారణ చేయకుండానే కేసు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి దుర్ఘటన ఏ మహిళకు రాకూడదని వాపోయారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది మార్చురి గది బయట ఉంచారు. దీంతో అనాథశవంలా సత్యమ్మ మృతదేహం పరిస్థితి ఉందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. 16న ఖననం చేసేందుకు గుంత తవ్వి పెట్టగా గుంత అలాగే వుండరాదని, గ్రామానికి అరిష్టమని పెద్దలు సూచించడంతో టెంకాయను గుంతలో పెట్టి పూడ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మా కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, మృతికి కారణం పైపాడులోని కొందరు వ్యక్తులేనని, వారి పేర్లతోసహా ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోవడం లేదని, అనుమానం ఉందని చెప్పిన వారిని విచారించి వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎస్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా.. 16వ తేదీన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యులను మృతదేహాన్ని ఖననం చేసేందుకు తీసుకెళ్లమని చెప్పినా పట్టించుకోవడం లేదు. పట్టించుకోవడం లేదనే మాటల్లో వాస్తవం లేదని చెప్పారు.

క్లుప్తంగా...

శునకమే సోదరుడు!



దండేపల్లి: చనిపోయిన పెంపుడు కుక్కను అన్నగా భావిస్తూ.. ఏటా సమాధి వద్ద రాఖీలు కడుతూ అభిమానం చాటుకుంటున్నారు ఇద్దరు అక్కా చెల్లెళ్లు. దండేపల్లి మండలం కన్నె పల్లి గ్రామానికి చెందిన మర్రిపెల్లి మల్లయ్య–కమల దంపతులకు 20 ఏళ్ల క్రితం పిల్లల్లేక పోవడంతో ఓ కుక్కను తెచ్చి రాము అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. దాన్ని పెంచుకున్న కొద్ది రోజులకు వారికి ఆడపిల్లలు రమ, రమ్య జన్మించారు. పిల్లలు పుట్టిన కొద్ది రోజులకు కుక్క చనిపోవడంతో తమ పొలం వద్ద సమాధి కట్టించారు. అయితే మల్లయ్య–కమల దంపతుల ఇద్దరు కూతుళ్లు ఆ కుక్కను అన్నయ్య లా భావిస్తారు. ఏటా రాఖీ పౌర్ణమి రోజున పొలం వద్ద ఉన్న కుక్క సమాధి వద్దకు వెళ్లి రాఖీలు కట్టి తమ అభిమానం చాటుకుంటున్నారు.

ఇద్దరిపై శునకాల దాడి



వెంకటేశ్ కాలిని తీవ్రంగా గాయపరిచిన కుక్క

ఇబ్రహీంపట్నం: వేర్వేరు ప్రాంతాల్లో కుక్కలు జరిపిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో నివసించే వెంకటేశ్ (45) ఆది వారం ఉదయం పనిమీద బయటికి రాగా.. అకస్మాత్తుగా ఓ శునకం వెనుక నుంచి కాలిని గట్టిగా పట్టి కరిచింది. చేతి వేలిని సైతం కరవడంతో లో తుగా గాయమైంది. తీవ్ర గాయాలతో వెంకటేశ్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చే యించుకున్నాడు. మంచాల మండలం ఆగా పల్లికి చెందిన శ్రీనివాస్ (57)పై ఆ గ్రామంలో కుక్కలు దాడి చేసి కరిచాయి. అతను కూడా ఇబ్రహీం పట్నం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు.



చేతి వేలికి అయిన గాయం

ఇటీవల రాయపోల్ గ్రామంలో ఓ బాలుడు కుక్క కాటుతో చికిత్స పొందుతూ మృతి చెందడం తెలిసిందే.

డీఎంకే బాటలో బీఆర్ఎస్!

▶ మొదటి పేజీ తరువాయి

పరిమితమైంది. 1991లో కేవలం 2 స్థానాలు, 1984, 2011లో కేవలం 25లోపు అసెంబ్లీ స్థానాల్లోనే గెలుపొందింది. బీఆర్ఎస్ కూడా రాష్ట్రంలో వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి రాగా.. గత ఏడాది ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలయ్యింది. దీంతో ఈ విషయంలోనూ డీఎంకేతో పోలిక ఉన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

డీఎంకే సంస్థాగత నిర్మాణం, కార్యకలాపాల పరిశీలన

బీఆర్ఎస్‌ను మరో 50 ఏళ్ల పాటు తెలంగాణ రాజకీయాల్లో ప్రబల శక్తిగా నిలిపేలా బలోపేతం చేస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇటీవల చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో ఆంజనేయ గౌడ్, తుంగ బాలు వంటి యువ నేతలు చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'ను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. డీఎంకేలో సుదీర్ఘకాలంగా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ భారతితో వారు భేటీ అయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, అనుబంధ విభాగాలైన యువజన, విద్యార్థి, మహిళా విభాగాల పనితీరు, సోషల్ మీడియా వింగ్ కార్యకలాపాలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు తరాలుగా పార్టీతో కేడర్ మమేకమైన తీరు, క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ఆరా తీశారు. తిరువల్లువర్, పశ్చిమ చెన్నై జిల్లాల్లోనూ పర్యటించిన బాల్క సుమన్ బృందం తాము పరిశీలించిన అంశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

తృణమూల్, బీజేడీ పనితీరుపై కూడా..!

ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పటికీ ఇటీవలి ఎన్నికల్లో పరాజయం పాలైన నేపథ్యంలో.. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన డీఎంకే ఆటుపోట్లను ఎలా అధిగమించిందనే అంశాన్ని అధ్యయనం చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ సీనియర్ నేతల బృందం సెప్టెంబర్‌లో చెన్నైలో పర్యటించనుంది. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు డీఎంకే సంస్థాగత నిర్మాణంతో పాటు ఇతర అంశాలను వారం రోజుల పాటు ఈ బృందం అధ్యయనం చేయనుంది. అలాగే దేశంలోని మరికొన్ని క్రియాశీల ప్రాంతీయ పార్టీల పనితీరును.. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలో బిజూ జనతాదళ్ (బీజేడీ) పనితీరును కేటీ ఆర్ బృందం ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ తర్వాతే సంస్థాగత నిర్మాణంపై దృష్టి

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కసరత్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత నిర్మాణం, శిక్షణ తదితరాలను ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ నాటికి డీఎంకేతో పాటు మరికొన్ని బలమైన ప్రధాన ప్రాంతీయ పార్టీల పనితీరుపై అధ్యయనం పూర్తి చేయాలని, అధ్యయనంలో తేలిన అంశాలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కార్యాచరణకు పదును పెట్టాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది.

కుటుంబ విలువలతోనే సురక్షిత భారత్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

రామంతాపూర్ (హైదరాబాద్): ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా రక్షా బంధన్ వంటి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలతోనే భారత్ సురక్ష భారత్‌గా వెలుగుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన రాఖీ పర్వదిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తనకు రాఖీలను కట్టిన మహిళలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రజలు ప్రేమ, సహనంతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి, వనవాసి కల్యాణాశ్రమం ప్రశిక్షణకమిటీ సభ్యుడు కొరివి రామచంద్రయ్య, జాతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

దక్షిణ డిస్కంలో భారీగా పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు భారీ స్థాయిలో 2263 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 101, అకౌంట్స్ విభాగంలో 47, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో 2099, పీ అండ్ జీ విభాగంలో 16 మందికి పదోన్నతులు లభించాయి. ఎస్ఈ నుంచి సీఈగా ఇద్దరు, డీఈ నుంచి ఎస్ఈగా 8 మంది, ఏడీఈ నుంచి డీఈగా 30, ఏఈ నుంచి ఏడీఈగా 58 మంది, జేఎల్ఎం నుంచి ఏఎల్ఎంకు 1650 మంది, అకౌంట్స్ విభాగంలో జీఎం నుంచి సీజీఎంగా ఇద్దరు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి జీఎంగా ఇద్దరు పదోన్నతి పొందారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 8న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించినప్పుడు.. 2017 నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉండటాన్ని కొందరు అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. మంత్రి స్పందిస్తూ పదోన్నతులు ఇవ్వాలని ఆదేశించారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించండి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు జూడా విన్నపం
- అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేయాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో తెలంగాణలోనూ ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, హాస్టళ్లలో మహిళా వైద్యులు, మెడికోలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జూనియర్ డాక్టర్ల సంఘం(జూడా) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం టీ–జూడా ప్రతినిధి డాక్టర్ చంద్రిక నేతృత్వంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తదితర కళాశాలల మహిళా ప్రతినిధులతో కలసి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎన్.శారదకు వినతిపత్రం అందజేశారు. రెసిడెంట్ డాక్టర్లు, మెడికోలు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. వైద్యుల పని ప్రదేశంలో వారి భద్రతాపరమైన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. క్యాంపస్ అంతటా సీసీకెమెరాల పర్యవేక్షణ ఉండాలి. అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ యాప్ స్థానిక పోలీస్ స్టేషన్లు లేదా కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేయాలన్నారు. పరిస్థితులను అంచనా వేయడానికి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు ఆకస్మిక తనిఖీలు చేయాలి. క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు జరగాలని కోరారు. ఇక తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్ల పట్ల చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారని జూడా నేతలు వెల్లడించారు.

రేపు కవిత బెయిల్ పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్‌గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ నెల 12న ఈ పిటిషన్ విచారణకు వచ్చినపుడు దర్యాప్తు సంస్థల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించిన సంగతి తెలిసిందే.



'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో డాక్టర్ ఎంఎస్ గౌడ్, రమణాచారి తదితరులు

ఇది ఓ సాధారణ దంత వైద్యుడి కల

డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దంతవైద్యరంగంపై ఇది ఒక అద్భుతమైన పుస్తకం అని అభివర్ణించారు. పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ కృషిని ఆయన అభినందించారు. తెలంగాణలోనే కాకుండా దక్షిణ భారతదేశంలో ఆయన అత్యుత్తమ దంత వైద్యుడిగా గుర్తింపును పొందారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ, ఇది తన ఆత్మకథ కాదన్నారు. ఈ పుస్తకం ఒక సాధారణ దంత వైద్యుడి కల అని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కాస్మెటిక్ డెంటిస్ట్రీని ప్రవేశట్టేందుకు తాను ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ రంగంలో తాను మొట్టమొదటి వైద్యుడినని చెప్పారు. దంత వైద్యం, దంత వైద్య వృత్తికి ప్రాచుర్యం కల్పించడంలో ఏళ్ల శ్రమ దాగి ఉందన్నారు. డెంటిస్టును మెడికల్ డాక్టర్‌కు సమానంగా నిలబెట్టడంలో తన లక్ష్యం నెరవేరిందని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. దంత సమస్యలకు నొప్పి లేకుండా చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. డెంటల్ లేజర్, ఇంట్రా – ఓరల్ కెమెరా, కంప్యూటరైజ్డ్ డెంటల్ వీడియో ఇమేజింగ్ – ఎయిర్ అబ్రాషన్ తదితర హై–టెక్ పరికరాలతో రోగ నిర్ధారణ, చికిత్సను సులభంగా, వేగంగా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



వృక్షాబంధన్

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతానురాగాలకు రాఖీ పండుగ ప్రతీతి. ఈ స్ఫూర్తిని ప్రకృతికి ఆపాదించి.. జాగ్రత్తగా కాపాడుకోవాలని పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన పలువురు మహిళలు నిరూపిస్తున్నారు. తెలంగాణ మహిళామిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో ఆదివారం వృక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొక్కల ఆకులు, కొమ్మలు, పూలు.. సేకరించి వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా రాఖీలు తయారుచేసి పరస్పరం కట్టుకున్నారు. వాటిని మొక్కలు, చెట్లకూ కట్టడం విశేషం. తమతోపాటు అవి ఎదగాలని, వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ (రామగుండం)

చిత్రం.. పదిలం

కరిగిపోతున్న జీవన చక్రంలో చెదరని ప్రతిబింబం ఫొటో. ఒక్క ఫొటోతో ఎన్నో మధురస్మృతులు.. ఏళ్ల నాటి జ్ఞాపకాలు మనసులో మెదులుతాయి. సంతోషం.. బాధ.. మధుర క్షణాలు, సాధించిన విజయాలతోపాటు కాలనుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులు, రెప్పపాటులో మాయమయ్యే దృశ్యాలను కెమెరాలో బంధించి పదిలంగా దాచుకుంటాం. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 'సాక్షి' వివిధ సందర్భాల్లో బంధించిన చిత్రమాలిక..


– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్



మాగనూర్ శివారులో జింకల సందడి



కష్టజీవుల బతుకు పోరు



పక్షుల కోలాహలం..



బిడ్డను భారంగా భావించకుండా..



వ్యవసాయ పనుల్లో నిమగ్నమై..



అధునాతన పద్ధతిలో కలుపు తీస్తూ..



సరిలేరు నీకెవ్వరు



ప్రకృతి ఒడిలో..



నెమళ్ల సయ్యాట

అక్రమ కేసులలో ఇరికించడం తగదు

- మోసం చేసేందుకే ప్రచార ఆర్భాటాలు
- మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించకుండా ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను, కార్యకర్తలను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అక్రమ కేసులలో ఇరికించి జైలుకు తరలించడం సరికాదని మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వనపట్లలో బాధితులకు అండగా నిలిచి డబ్బులను ఇప్పించాల్సిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, ఇరువురు నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేయించి జైలుకు తరలించారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదును కూడా పోలీసులు పక్కనపెట్టి వారిచే మరో ఫిర్యాదును రాయించుకొని ముగ్గురిని జైలుకు తరలించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి విధానాలను తండ్రీకొడుకులు మానుకోవాలని హెచ్చరించారు. వనపట్లకు చెందిన మన్యపురెడ్డికి ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేకపోయినా దురుద్దేశపూర్వకంగానే కేసులో ఇరికించి పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసులు లేకుండా తప్పించేలా కుట్రలు చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో 13 హామీలను ఇవ్వడం జరిగిందని వాటిలో ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప, మిగిలిన హామీలు ఏవి కూడా పూర్తిగా అమలు కావడం లేదని విమర్శించారు. రైతుల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.17 వేల కోట్లను మంజూరు చేసి పూర్తిగా అమలు చేశామని రైతులను మోసం చేసే విధంగా ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.5,500 కోట్ల అవినీతి జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసిందని వాటిని కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రాంతంలో విధులు నిర్వహించిన ఆదిత్యనాథ్ దాసును సలహాదారులుగా నియమించుకోవడం దేనికి సంకేతం అని అన్నారు. సమావేశంలో నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, పాండు, లక్ష్మయ్య, సంతోష్, సత్యం, అహ్మద్, బీముడు, వెంకటేష్, అర్జునయ్య పలువురు పాల్గొన్నారు.

22.50 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం వాహనంతో ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): సారా తయారీ కోసం ఉపయోగించే నల్ల బెల్లాని ఎక్సైజ్‌శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 22.50 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన దాడుల్లో బొలెరో వాహనంలో 75 సంచుల్లో 22.50 క్వింటాళ్ల నల్ల బెల్లం, 5 లీటర్ల సారాను తరలిస్తున్నారు. ఈ మొత్తం విలువ దాదాపు రూ.12 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ నుంచి తెలకపల్లి మండలం, కొల్లాపూర్ ప్రాంతాలకు సారాకు ఉపయోగించే బెల్లాని ఇద్దరు వ్యక్తులు కలిసి తరలిస్తున్నారు. పెద్ద కొత్తపల్లి మండలానికి చెందిన పుట్ట శ్రీనివాస్‌ను అరెస్ట్ చేయగా.. తెలకపల్లి మండలం వట్టిపల్లి తండాకు చెందిన ము డావత్ ప్రతాప్ పరారయ్యాడని అధికారులు తెలిపారు. ఒక్కో బ్యాగులో 30 కిలోల వరకు నల్లబెల్లం ఉందని, 22.50 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు వివరించారు. శ్రీనివాస్, ప్రతాప్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలియజేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాస్, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, ఎస్ఐ సృజన్‌రావు, సిబ్బంది చంద్రయ్య, సూర్యం, మునీందర్, జనార్దన్ ఉన్నారు.

బీచుపల్లిలో భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



ఆలయంలో పవిత్ర మాలలను ఊరేగిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా మూడోరోజు సుదర్శన్ నారాయణన్ బృందం ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, విశేష ఆరాధన, మూలమంత్ర హోమాలు, సుదర్శన హోమం, నారసింహ హోమం, ఆలయంలో విగ్రహములకు గోపురములకు పవిత్రములు సమర్పణ, లఘుపూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి కార్యక్రమాలు చేపట్టారు. సాయంకాలం యాగశాల తిరువారాధన, నిత్య హోమం, మూలమంత్ర హోమాలు, మహాలక్ష్మి హోమం, హయగ్రీవ హవనం, లఘుపూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి, వంటి ప్రత్యేక పూజలను అర్చకులు వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, ఆలయ సెక్రటరి సీతారామిరెడ్డి, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన మృతుడి బంధువులు

లింగాల: మండల కేంద్రానికి చెందిన పోల తిర్పతయ్య భూతగాదాల కారణంగా శనివారం షాద్‌నగర్‌లోని అన్న పోలనాగయ్య ఇంటికి సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మృతదేహాన్ని ఆదివారం లింగాలకు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. పోల తిర్పతయ్య మృతికి అతడి అన్న నాగయ్యతో పాటు కావేటి శ్రీరాములు, పోల సావిత్రమ్మ, పోల సందీప్, కావేటి శివకుమార్ కారకులని ఆరోపించారు. భూమి విషయంలో పై వ్యక్తులు కోర్టులో కేసులు వేసి మూడేళ్ల నుంచి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. వీరి ఒత్తిడిని భరించుకోలేక శనివారం షాద్‌నగర్‌కు వెళ్లి కేసులు ఉపసంహరించుకోండి, మాట్లాడుకుందామని అన్నను ప్రాధేయపడగా.. కనికరించలేదని ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటన లింగాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగలేదని, ఇక్కడ ఆందోళన నిర్వహించడం అర్థరహితమని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

రాఖీ పండగ ఆదాయంపై ఆర్టీసీ దృష్టి



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

రీజియన్ పరిధిలో 290 అదనపు సర్వీసులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగ ఆదాయంపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఏడాది రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజులపాటు ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో మూడు రోజులపాటు 290 అదనపు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఆదివారం రోజు 90 బస్సులు నడపగా సోమవారం 100 అదనపు సర్వీసులు, ప్రయాణికుల తిరుగు ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని మంగళవారం మరో 100 అదనపు బస్సు సర్వీసులు నడపడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో రద్దీ

మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ కనిపించింది. రాఖీ పండుగకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్ కిటకిటలాడింది. హైదరాబాద్, తాండూరు, వనపర్తి, నాగర్‌కర్నూల్ రూట్లలో ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించారు. హైదరాబాద్ రూట్లోని బస్సులన్నీ కిక్కిరిసి ప్రయాణించాయి. ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.

డిపోల వారీగా ప్రత్యేక బస్సులు ఇలా..

వనపర్తి 48	షాద్‌నగర్ 45	నాగర్‌కర్నూల్ 41
మహబూబ్‌నగర్ 39	గద్వాల 33	కల్వకుర్తి 28
నారాయణపేట 22	అచ్చంపేట 20	కొల్లాపూర్ 14

సద్వినియోగం చేసుకోవాలి



ప్రయాణికుల సౌకర్యార్థం రాఖీ పండుగను పురస్కరించుకొని రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసకోవాలి. అలాగే సోమవారం డిపోలో రాఖీ పండుగ వేడుకలు నిర్వహిస్తున్నాం.

– వి.శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్